
# విలువలు



## బొళ్ళ సతీష్ బాబు

సమాజంలో విలువలు పతనమైపోతున్నాయి. వ్యక్తుల మధ్య ఆప్యాయతలు కరువయిపోతున్నాయి. ఉదయం నుండి ఇప్పటికామాట ఒక వందసార్లు అయినా అనుకొని ఉంటాను. నా ప్రాణ స్నేహితుడు చైతన్య నానుండి, పతనమైన ఈ సమాజం నుండి దూరంగా వెళ్లిపోతూ ఆఖరి సారిగా అన్న మాటలవి.

ఈ రోజు అన్నయ్య అలా అనకుండా ఉండి ఉంటే నాకు చైతన్య గుర్తొచ్చేవాడు కాదేమో. వాడు నా ప్రాణ స్నేహితుడు అని చెప్పుకునే అర్హత బహుశా నాకు లేదేమో. ఎందుకంటే వాడి ప్రాణంలో ప్రాణంగా నన్ను చూసుకునే వాడు. కాని నేను అలా చెయ్యలేక పోయేవాడ్ని. అసలు మా ఇద్దరి స్నేహాన్ని చాలా మంది విచిత్రంగా చూసేవారు. చైతన్య చదువుకున్న నిరుద్యోగి. నేనొక సాధారణ మోటార్ మెకానిక్‌ని. నా ఫీల్డ్‌లో నాకెన్నో అనుభవాలు. నేను అంత తొందరగా ఎవర్నీ నమ్మేవాడ్ని కాదు. పరిస్థితులకనుగుణంగా నన్ను నేను మలచుకునే వాడ్ని. వాడికెంతోమంది స్నేహితులున్నారు. కులమత భావాలు లేకుండా స్నేహం కోసం ఏం చెయ్యడానికైనా వెనుకాడే వాడు కాదు. అయినా నాకిచ్చే ప్రాధాన్యత వేరే వారికిచ్చేవాడు కాదు.

"బాబ్జీ! నీ తర్వాతేరా నాకెవరైనా" అని వాడన్నప్పుడు నా మనసు నా ప్రవర్తనకు విరుద్ధంగా స్పందించేది. కాని వెంటనే నేను అదుపులో పెట్టేవాడిని. ఎందుకంటే నాది నిలకడలేని మనస్తత్వం. చైతన్య అభిప్రాయాలు ఎప్పుడూ స్థిరంగానే ఉండేవి. ఎవరిపట్లయినా నమ్మకం పెంచుకుంటే దానిని త్వరగా తుంచలేదు.

నేను నా కులం కోసం పార్టీ మార్చిన వాడిని, కాని నా కోసం వాడు వాడికులాన్నంతా ఎదిరించి నేనున్న పార్టీలో చేరాడు. నేను ఏ విషయం వాడితో చర్చించకున్నా వాడు ప్రతి విషయాన్ని నాతో చర్చించేవాడు. వాడి ఎంగిలి తినడానికి నేను సంకోచించినా నా కంచంలో ముద్దలు వాడు ఆప్యాయంగా తినేవాడు. అలాగని మీరు వాడ్ని నాకంటే పేదవాడిగా భావించవచ్చు. కాని వాడు నాకంటే అన్నిట్లోనూ గొప్పవాడే.

ఆస్తి విషయంలోనూ, ఆప్యాయతల విషయంలోనూ, స్నేహితుల విషయంలోనూ అన్నిట్లోనూ వాడు నాకంటే గొప్పవాడు.

ఊళ్లో ఎంత మంది స్నేహితులతో తిరిగినా రాత్రి నేను షెడ్ నుండి ఇంటికొచ్చేటప్పటికి నా కోసం ఎదురు చూసేవాడు. నేను స్నానం చేసి, భోజనం ముగించి వచ్చేవరకూ నా తల్లిదండ్రులు చూపే నిరసన చూపుల్ని చిరునవ్వుతో స్వీకరిస్తూ మా వీధి అరుగుమీద కూర్చునేవాడు చైతన్య.

మా తల్లిదండ్రులు చైతన్యని ఒక విరోధిగా చూసే వారు. ఎందుకంటే వాడు నన్నుపాడు చేస్తున్నాడేమోనని అనుమానం. నేనే రోజైనా షెడ్‌కి వెళ్లకుండా ఎక్కడ తిరిగినా చైతన్యని అడిగేవారు. 'మా వాడెక్కడికి వెళ్లాడీవేళ?" అని.

అయినా ప్రతిరాత్రి మా ఇంటి పక్కన ఉన్న కాలువ వంతెనపై కూర్చుని నాతో మాట్లాడితేగాని వాడికి నిద్రపట్టేది కాదు. ఆదివారం నాకు వర్క్ ఉండదు. ఆదివారం నాతోకలిసి తిరగాలని, సాయంత్రానికి ఏదో ఒక సినిమా చూసి ఇంటికి చేరాలని వాడు నాతో చెప్పేవాడు. కాని వాడి కోరిక తీర్చలేకపోయేవాడిని. ఎందుకంటే నా ఫీల్డ్‌లో నాకు రకరకాల పరిచయస్థులు.

చైతన్యకు ఒక మరదలుంది. వాళ్ల ఇళ్లు పక్క పక్కనే ఉండడంతో ఎప్పుడూ చైతన్య వాళ్లింటి దగ్గరే ఉండేది. ఆ అమ్మాయంటే నాకెందుకో చెప్పలేని అభిమానం. ఆ అమ్మాయిని చూడటం కోసం నేను ప్రతిరోజూ చైతన్య వాళ్లింటికి వెళ్లేవాడిని. వాళ్ల అమ్మగారు నన్ను కూడా వాళ్లబ్బాయిలాగే చూసేది. నేను కూడా "చిన్నమ్మా" అంటూ వరుస పెట్టి పిలిచేవాడ్ని. రోజు రోజుకూ నాకు ఆ అమ్మాయి పట్ల ఆరాధన ఎక్కువయిపోయింది. చైతన్య కాలేజీకి వెళ్లినప్పుడు నేను వాడింటికి వెళ్లి ఆ అమ్మాయితో మాట్లాడే వాడిని. పరిచయం పెరిగాక చెస్ కూడా ఆడేవాళ్లం. చైతన్య వాళ్ళమ్మ కూడా మా మధ్యనే కూర్చుని నన్ను ఎంకరేజ్ చేస్తూ నా పక్షం వహించేది అదో ప్రోత్సాహంగా అనిపించేది. ఆ అమ్మాయి కూడా నా మీద మనసు పెంచుకుందనే విషయం నేను తొందరగానే గుర్తించగలిగాను.

"పెళ్లంటూ చేసుకుంటే లతనే చేసుకుంటా"ననే వాడ్ని అప్పుడప్పుడూ నా అంతరంగిక మిత్రుల దగ్గిర. కాని చైతన్యకు మాత్రం ఈ విషయం చెప్పలేక పోయేవాడ్ని. వాడి మరదలుతో వాడు ఎప్పటిలానే మాట్లాడేవాడు. నాకు మాత్రం చాలా కోపం వచ్చేది. నా సొత్తునేదో వాడు దోచుకుంటున్నట్లు కానీ నా విషయం వాడికి చెప్పలేదనే సంగతి జ్ఞప్తికి వచ్చి మిన్నకుండే వాడిని. చెప్తే ఎలా స్పందిస్తాడో అని భయంగానూ ఉండేది.

చివరికి ధైర్యం చేసి నా నిర్ణయం జార్జితో చెప్పేశాను. జార్జికి తెలిసిన ఏ విషయమైనా చైతన్యకు తెలియక మానదు. నేననుకున్నట్లుగానే సమాచారం చైతన్యకు చేరింది. రోజూలాగే ఆ రోజు రాత్రి వంతెన మీదకు చేరుకున్నాం. వాడేమీ మాట్లాడటంలేదు.

మా ఇద్దరి మధ్య మౌన సామ్రాజ్యం.

ఇంతలో జార్జి వచ్చాడు. అప్పుడు నోరు విప్పాడు చైతన్య.

"బాబ్జీ! జార్జి పొద్దున్న నాకో విషయం చెప్పాడు. నిజమేనా"

"అవునురా..." మెల్లగా వచ్చింది నా స్వరం.

"మరింత కాలం నాకెందుకు చెప్పలేదురా. నేను నీ ఎదుటే లతతో మాట్లాడుతుంటే, పరాచికాలాడుతుంటే తలొంచుకుని నిలుచున్నావే గాని, లతను నేను ప్రేమిస్తున్నానని నాకెందుకు చెప్పలేదురా"

"నువ్వేమంటావోనని భయం"

"పిరికివాడు ఏదీ సాధించలేడు. మనసులో పిచ్చి పిచ్చి ఆలోచనలు తప్ప. నా స్నేహితులు ఆ కోవలోకి చేరడం నాకిష్టం లేదు. నీకేం సహాయం కావాలన్నా నన్నడుగు" అర్జునుడికి అభయమిస్తున్న శ్రీకృష్ణుడిలా కనబడ్డాడు నాకంటికి.

"ఆ అమ్మాయి అభిప్రాయం తెలుసుకున్నావా" అన్నాడు.

"ఊ, నేనంటే ఆమెకు ఇష్టమే"

"లతను నేను పెళ్లి చేసుకుంటాను. నువ్వు సహకరిస్తే" ఈసారి కొంచెం ధైర్యంగానే వచ్చింది నాగొంతు.

నాకోసం చైతన్య నడుం బిగించాడు. వాళ్ల మేనత్తతో విషయం మాట్లాడాడు. ఆమె అందుకు ఒప్పుకోలేదు.

కులం గోడలు మా జీవితాల మధ్య అడ్డుగా నిలిచాయి. మా కుటుంబానికి, వాళ్ల కుటుంబానికి మధ్య చిన్నసైజు కురుక్షేత్రం జరిగింది.

మా అమ్మా, నాన్నా కులాంతర వివాహం వల్ల నష్టాలు, భవిష్యత్తు గురించి బాగా నూరిపోశారు. నాలో కొంచెం మార్పొచ్చింది. వెంటనే నన్ను అన్నయ్య దగ్గరికి హైదరాబాద్ పంపేశారు. ఉన్న ఊరుని, నా స్నేహితుల్ని, ముఖ్యంగా చైతన్యని వాడి కర్మానికి వాడిని వదిలేసి రాజధానికొచ్చేసి అన్నయ్య దగ్గర స్థిరపడ్డాను.

హైదరాబాద్ వచ్చిన మూడు నెలలకి ఊరెళ్లిన నాకు చైతన్యని చూడగానే మనసు చివుక్కుమంది. బాగా చిక్కిపోయి, బికారిలా తిరుగుతూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు.

ఇటు మా కులస్థులు, వాడి కులస్థులు వాడిని అంటరాని వాడిగా చూస్తున్నారు. కొద్ది మంది ఆంతరంగిక మిత్రులతో మాట్లాడటం తప్ప వాడిలో ఇదివరకటి చైతన్యం లేదు. నా జీవితంలో మొట్టమొదటి సారిగా నా కళ్లు వర్షించాయి.

వాడిని నాతో తీసుకుపోవాలనే నిర్ణయానికొచ్చాను. వాళ్లింట్లో చెప్పాను. బాబాయిగారూ! చైతన్యని నాతో హైదరాబాద్ తీసుకెళతాను. అక్కడేదైనా ప్రయివేట్ జాబ్ చేస్తాడని" ముందు ఆయన అంగీకరించలేదు.

"ఇప్పుడు వాడికేమి లోటురా! ఉద్యోగం రాకపోతే వ్యవసాయం చేసుకునైనా ఇక్కడే బతుకుతాడులే" అని. నేను పట్టిన పట్టు విడవలేదు.

"ఊరు దాటి బయటికి వెళ్తే వాడిలో ఏమైనా మార్పొస్తుంది" అని నాతో హైదరాబాద్ తీసుకొచ్చాను.

మా ఇంటి ఓనర్ సహకారంతో ఒక మంచి జాబ్ చూశాను. తర్వాత వాడి నైపుణ్యంతో మా ఏరియాలోనే విలేకరిగా ఒక జాతీయ దినపత్రికలో ఉద్యోగం దొరికింది.

వాడు వేరే రూంలో ఉంటూ మా ఇంటికి వస్తూ, పోతూ ఉండేవాడు. అది మా అన్నా వదినలకు ఇబ్బంది కలిగిస్తుందన్న విషయాన్ని నేను గమనించాను.

మా ఇంటి ఓనర్ నాకు బాగా క్లోజ్ కావడంతో ఆయన సలహాని అడిగాను. వార్తా సేకరణలో తిరుగుతూ వాడు ఆ రాత్రి మా ఇంట్లోనే రెస్ట్ తీసుకుని, ఉదయాన్నే వెళ్లిపోయాడు. అది నా అదృష్టం. వాడి దురదృష్టం.

ఆ రోజు సాయంత్రం మా ఇంటి ఓనర్ సలహా ప్రకారం వాడి రూంకి వెళ్లాను.

"చైతన్యా! ఇవాళ అన్నయ్య వాచ్, గోల్డ్ చైన్ కనిపించడంలేదురా, నువ్వుగాని తీసావేమోనని..."

"ఆ... వాడు అలాంటి వాడు కాదు. వాడు తియ్యడని నేనెంత చెప్పినా మా ఇంటి ఓనర్ వినడం లేదురా. నా ఇంట్లో ఇంత వరకూ ఇలాంటి సంఘటన జరుగలేదు. ఈ రోజు ఆ అబ్బాయే వచ్చాడు. కేసు పెడతానంటున్నాడురా..." మెల్లగా నా ప్లాన్ బయట పెట్టా.

వాడి ముఖంలో నెత్తురు చుక్కలేదు పాపం. నాతో పాటే వచ్చి మా ఇంటి ఓనర్‌తో మాట్లాడాడు.

"నాకేం తెలియదు" అని మొత్తుకున్నాడు.

"సరే! అయితే ఇంకెప్పుడూ ఈ ఇంటి గుమ్మం తొక్కకు వెళ్లిపో" అంటూ వార్నింగ్ ఇచ్చాడు.

గేటు వరకూ వెళ్లాక నన్నుపిలిచాడు.

"బాబ్జీ సాయంత్రం నా రూమ్‌కి రా... పనుంది" అంటూ తలవంచుకుని వెళ్లిపోయాడు.

సాయంత్రం వాడి రూంకి వెళ్లా. తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి. నెట్టుకుని లోపలికి వెళ్లా. చైతన్య కనిపించలేదు. కిచెన్‌లోకి వెళ్లి చూశా, స్థాణువునై నిలబడి పోయాను. అప్పటికే చైతన్య ఊపిరి అనంత వాయువుల్లో లీనమైంది. ఒక చేతిలో మత్తు బిళ్లల సీసా, ఒక చేతిలో నన్నుద్దేశించిన లెటర్ తీసి చదివాను.

"బాబ్జీ!"

సమాజంలో విలువలు పతనమవుతున్నాయి. వ్యక్తుల మధ్య ఆప్యాయత, అనురాగాలు కరువవుతున్నాయి"

రెండవసారి నేను ఏడ్చాను. కసితీరా ఏడ్చాను.

పది రోజులు గడిచాయి. పొద్దున్నే షాపుకు బయలుదేరిన నన్ను పిలిచాడు అన్నయ్య.

"బాబ్జీ! నీ కోసం వేరేగా రూం తీసుకున్నానురా. నువ్వు చెప్పకపోయినా నీకిక్కడ ఇబ్బందిగా ఉంటుందని నేను గ్రహించాను" అంటూ తాళం చెవిని నా చేతిలో పెట్టాడు.

వాళ్లకి ఇబ్బందిగా ఉంటుందని చెప్పకుండా నా ఇబ్బందిని చెప్తూ నా మీద ప్రేమ చూపిస్తున్న అన్నయ్యను చూసి నాలో నేను మూలిగాను.

"సమాజంలో విలువలు పతనమవుతున్నా"యని.